స్వామియే శరణం అయ్యప్ప

భక్తి కుసుమం

శ్రీ అయ్యప్పస్వామి వారి పూజా విధానం
మరియు భక్తి పాటలు

స్వామియే శరణం అయ్యప్ప

భక్తి కుసుమం

శ్రీ అయ్యప్పస్వామి వారి పూజా విధానం
మరియు భక్తి పాటలు

సేకరణ, ప్రచురణ :
కె. సుధాకర్ బాబ్జి

ద్వితీయ ముద్రణ 2008 వెల : అమూల్యం

శ్రీ హరిహర పుత్రుడు శ్రీ ధర్మశాస్తా అయ్యప్పస్వామి వారి మహిమలు అపూర్వమైనవి, అనిర్వచనీయమైనవి.

"భక్తి కుసుమం" అనే పుస్తకం కేవలం సంకలనమే తప్ప స్వయం ప్రతిభతో రచించిన స్వీయ రచన కానేకాదు. స్వామి చరిత్ర, పూజా విధానము, భక్తిపాటలు, గతంలో ఎందరో మహానుభావుల ద్వారా ముద్రింపబడిన, కొన్ని స్వానుభవములు, అనుభూతులు మిళితముచేసి ఈ పుస్తక ప్రచురణకు పూనుకోవడం జరిగింది. ఇది కేవలం ఆ హరిహరాత్మజుని సంకల్పం, ఆదేశంగా భావిస్తాను, భావిస్తున్నాను.

నాకు జన్మనిచ్చిన తల్లిదండ్రులు సాంబశివరావు, భాగ్యమ్మలకు, నన్ను మొదటిసారి కన్నెస్వామిగా శబరిమల యాత్ర చేయించిన శ్రీ రాజ బాపయ్య గురుస్వామిగారికి, నాలో భక్తి భావం కలిగించి ప్రతి నిత్యం నేను పితృ సమానులుగా భావించే శ్రీ రాధాకృష్ణమూర్తి గురుస్వామి గారికి, అరుణ్ గురుస్వామి గారికి, నాకు చేదోడు వాదోడుగా వుంటూ అన్నివేళలా తన అమూల్య సలహాలందిస్తూ వస్తున్న మార్గదర్శకులు రాజేంద్రన్ గురుస్వామి గారికి, శ్రీ సతీషన్ నాయర్ గారికి, ఈ సంకలనంలో సహకరించిన చంద్రమౌళి గురుస్వామి గారికి సదా నేను కృతజ్ఞుడిని. ఆ శబరీశుని కరుణాకటాక్షాలు యావన్మందికీ ఉండగలవు.

నిరంతరం స్వామి అయ్యప్ప సేవలో
తరించాలని తపించే
కాండ్ర సుధాకర్ బాబ్జి

మాలధారణ మంత్రం

జ్ఞానముద్రాం శాస్తృముద్రాం గురుముద్రాం నమామ్యహం।
వనముద్రాం శుద్ధముద్రాం రుద్రముద్రాం నమామ్యహం ।
శాంతముద్రాం సత్యముద్రాం వ్రతముద్రాం నమామ్యహం ।
శబర్యాశ్రమ సత్యేన ముద్రాం పాతు సదాపిమే ।
గురుదక్షిణాయా పూర్వం తస్యానుగ్రహ కారిణే ।
శరణాగత ముద్రాఖ్యం త్వన్ముద్రాం ధారయామ్యహం ।
చిన్ముద్రాం ఖేచరీముద్రాం భద్రముద్రాం నమామ్యహం ।
శబర్యాచల ముద్రాయై నమస్తుభ్యం నమో నమః ।
అష్టాదశం మహాసారం శాస్తృ దర్శన కారణం ।
విధితం శుద్ధ ముత్కృ ష్టం సన్నిధానం నమామ్యహం ।
ఊరుజం వాపురం చైవ భైరవ ద్వన్న సేవితం ।
విష్ణుమాయాన్వితం శాస్తృ పరివారం నమామ్యహం ॥
స్వామియే శరణం..........................శరణమయప్ప

తాత్పర్యము - సద్గురువు నాశ్రయించి, గురువును సేవించి సంతోష పరచి అతని అనుగ్రహమును పొంది శరణాగతినొంది, నిత్యము, సత్యమునైన శబరియాశ్రమ మందు సాక్షాత్కరించిన నీ శరణాగత ముద్రను నమస్కరించి ధరించుచున్నాను. ఈ మంత్రము సాధకుడు దీక్షనెట్లు గ్రహించవలయును, సాధన నెట్లు చేయవలయును అను విషయము బహు విపులముగా గోచరించుచున్నది.

గురుముద్ర, శాస్తృ ముద్ర - గురువును అశ్రయించి సేవించిన అతని అనుగ్రహముచే శాస్త్రాధ్యయనము అలవడును. వేద శృతి, శాస్త్ర పురాణ, ఉపనిషత్ లందు భగవానుని స్వరూప

మెట్లు నిరూపించబడినదియు, భగవత్సాక్షాత్కారమునకు సాధకుడు చేయవలసిన సాధన విధానమును పొందవచ్చును. ఇట్టి రహస్యము తెలుపుచున్నవి గురుముద్ర, శాస్త్రముద్రలు.

జ్ఞానముద్రాం - గురువును ఆశ్రయించి పొందిన శాస్త్ర జ్ఞానము వలన బ్రహ్మమును(పరమేశ్వరుని) తెలిసికొను జ్ఞానము కలుగును.

వనముద్రాం - భగవత్సాక్షాత్కారము (బ్రహ్మ జ్ఞానము) పొందిన సాధకుడు జనన, మరణ, జరాభయ యుతము దుఃఖ దాయకమైన సంసార కాననమును దాటి మోక్షము నొందగలడు.

శుద్ధ ముద్రాం - నిరంతర సాధనచే బ్రహ్మజ్ఞాని శుద్ధ సత్వస్వరూపాత్మానంద చిత్తుడై చరించును.

రుద్రముద్రాం - స్వాత్మానంద చిత్తుడైన జ్ఞాని జనన, మరణ దుఃఖరహితుడై ముక్తి పదము నొందును.

సత్యముద్ర, శాంతముద్ర, వ్రతముద్ర - మాలధారణ చేసిన సాధకుడు నియమిత జీవన వ్రతమాచరించి, శాంతచిత్తుడై పరమేశ్వరుని (ధర్మశాస్తావారిని) ధ్యానించిన సత్యము నిత్యము అయిన ఆ భగవంతుని అనుగ్రహము పొందవచ్చును. నిరంతర సాధనచే పంచేంద్రియములు నిగ్రహించబడి కళ్ళెములేని గుర్రము విధమున పరుగిడు మనస్సు స్థిరత్వమునొందును. స్థిరచిత్తుడు అరిషడ్వర్గములను సాధించి, శుద్ధ సత్వము, నిత్యము సత్యము అయిన బ్రహ్మమును గాంచును.

భద్రముద్ర - స్థిర చిత్తుడైన సాధకుడు గురువు అనుగ్రహము నొందినచో జీవన కాలము నందు యాతనామయ జనన మరణముల నొందని శాశ్వత మార్గము గాంచి భద్ర చిత్తుడై చిత్తమున ఆత్మ సంధానము నొనర్చి ఆనందమయుడు అగును.

ఖేచరి ముద్ర - ఈ ముద్ర సాధనచే కాకివలె ప్రాపంచిక విషయ లంపటములు చిక్కువడిన మనస్సును, పంచేంద్రియములను నిలువరించి ఆత్మ స్వరూప పరబ్రహ్మ (ధర్మశాస్తా) పరమేశ్వరుని సాధకుడు గాంచి తరించును.

చిన్ముద్రాం - స్థిరచిత్తుడై నిరంతర సాధన చేయు భక్తుడు త్రిగుణ (సత్వ రజస్తమో గుణములు) రహితుడై విశ్వమునంతయు నిండియున్న పరమేశ్వరుని గాంచి అతని యందు లీనమై అద్వైత మయుడై ముక్తి పదము నొందును. ఇట్లు పవిత్ర, ఉత్కృష్ట, మహోన్నత నిగూఢార్థములు గలిగిన మాలను ధరించు భక్తులు నిర్మల చిత్తులై, భక్తియుత మనస్కులై ధరించి స్వామివారి దీక్షాకాలమున మాత్రమే కాక నిరంతర సాధన చేసి, దర్శనము నొంది తరించవలయునే గాని, దీక్షాలోపము నొనరించుకొని ఆపదలను గొని తెచ్చుకోరాదు. (పై ముద్రల రహస్యము, స్వరూపము, స్వభావములను గురుసాన్నిధ్యమున సాధించ వలయును గాన వాటి వివరణలను తెలుపబడలేదు.)

మాలాధారణ మంత్రము యొక్క తాత్పర్యము

శబరిమలను ఉద్దేశించి మాలవేసి దీక్షను ప్రసాదించు ప్రతి గురుస్వామి "జ్ఞానముద్రాం, శాస్త్ర ముద్రాం" అను మంత్రమును చెప్పించి మాల వేస్తున్నారు. ఈ సంస్కృత శ్లోకము యొక్క తాత్పర్యం తెలియకనే పలువురు యాత్ర చేయుచున్నారు. మాలవేయునపుడే "జ్ఞానమును ప్రసాదించి, మోక్షమునకు దారి చూపే ఈ ముద్రమాలను వేసుకొనుచున్నాను. ఈ క్షణము నుండి మదిని చెడగొట్టే మధు మాంసములను ముట్టను. దీక్షాకాలములో (భార్యను సైతం) స్త్రీలందరిని సోదరిగాను, తల్లిగాను తలచి మెసలుకొంటాను. పెద్దలయెడల గౌరవ మర్యాదలతో వ్యవహరిస్తాను. ఇంకెవరి ప్రేరేపణయు లేక నాకు నేనే ఈ దీక్షలో ప్రవేశించి అందరిచే స్వామి అని పిలిపించుకొనే నేను ఈ దీక్షలోని విధివిధానములను ఉల్లంఘించి శ్రీ స్వామి వారికి, ఈ దీక్షకు కళంకము వాటిల్లు రీత్యా వ్యవహరించను. మండల కాలం అనగా 41 దినములు దీక్ష పాటించిన పిమ్మటే ఆ పావనపదునెట్టాంపడిని ఎక్కుతానని సద్గురు సమక్షమున, దైవ సన్నిధిలో, ప్రమాణముచేసి ఈ ముద్రమాలను వేసుకొనుచున్నాను." అని అందరికి అర్థమయ్యే శైలిలో ఈ మాలాధారణ మంత్రము యొక్క తాత్పర్యమును ఇందులోని పరమార్థతత్వమును తెలిపి మాలాధారణ గావిస్తే మాల వేసుకొన్నవారు, మాలవేసిన వారు ఇరువర్గీయులు రక్షింపబడుతారు. ఇది ప్రతివారు ఆచరించ దగిన, ఆచరించ వలసిన ప్రధాన సూత్రమగును.

మౌన దీక్షకు యుండవలసిన నియమములు : దేవుడు జీవుడు ఒక్కడే యను బ్రహ్మరహస్యం ఎరింగిన వారందరూ మౌనదీక్షయే పుచ్చుకొంటారు. అది పరిపక్వత చెందిన స్థితి. అయ్యప్ప భక్తులు ఆకలికి అలమటించిపోయి రోదించే శిశువు వంటివారు. స్వామి అయ్యప్ప శరణఘోష ప్రియుడు. మన ఈతి బాధలను రోదిస్తూ శరణ ఘోషమూలాన వినిపిస్తే స్వామి అయ్యప్ప సంతుష్టుడై మన కోర్కెలను మన్నిస్తారు. కోర్కెలు లేని ముముక్షువులు మౌనదీక్ష వహిస్తారు. అలాంటి ఉన్నతస్థాయికి కొనిపోగల దీక్ష చేపట్టువారికి చాలాచాలా ఓర్పు అవసరం. కనుక ఒకటికి రెండు సార్లు ఆలోచించి ఈ మౌన దీక్షను స్వీకరించాలి. నియమం మనస్సులోని ఇతర ఆలోచనలకు తావివ్వక సదా భగవన్నామ స్మరణ మనస్సులో చేసుకొంటూ యుండడమే.

ఉపవాస దీక్ష - శబరిమల యాత్ర విధి విధానములలో నియమిత, పరిమిత ఆహారం భుజించమన్నారే తప్ప, ఎక్కడ ఉపవాసదీక్ష చెప్పబడలేదు. ఈ యాత్ర సుమారు 5 దినముల వరకు కొండలు, కోనలు, వాగులు, వంకల మధ్య కాలినడకగా నడిచి వెళ్ళే యాత్ర గనుక ఆ ప్రదేశమందలి మన నోటికి రుచియైన ఆహార పదార్థములు లభ్యముకాదు. కావున ఆహార నిబంధనలు ఏర్పరచుకొని ఆయా ప్రదేశములలో లభించే ఆహార పదార్థాలతో సర్దుకుపోవుటకు అలవరచుకొమ్మన్నారు. అంతేగాని ఉపవాస దీక్షయుండి శరీరాన్ని నీరసింపచేసుకొని యాత్ర మధ్యలో మానసిక, శరీరక బాధలకు గురికానవసరం లేదనియు తెల్చి చెప్పియున్నారు.

శబరిమల దీక్ష తీసుకోవడంలోని పరమార్థం - శబరిదీక్ష తీసుకోవడం వలన మనస్సు, శరీరం రెండు ఒక్కసారిగా ఓవర్ ఆయిల్ చేసినట్లు పరిశుభ్రమగుతుంది. దీనివలన భగవంతుడు ప్రసాదించిన నిండు నూరేళ్ళ జీవితాన్ని ఆరోగ్యవంతముగా మలచుకొనవచ్చును. దుర్వ్యసనములకు దూరమగుటచే ఆర్థిక మెరుగు గూడా ఏర్పడును.

మాల విసర్జన మంత్రం

ఉపరివిధ నియమ నిష్ఠలతో - శబరిమల యాత్ర పూర్తైన పిదప - ఈ దిగువ మంత్రంతో మాల విసర్జన చేయవలెను

శ్లో ॥ అపూర్య మచ లారోహ దివ్యద్దర్శన కారణం
శాస్త్రముద్రాత్ మహాదేవ దేహిమే వ్రతమోచనం॥
సమస్త నలీదళరక్షనే శరణమయ్యప్ప

స్వామియే శరణం అయ్యప్ప

మాల ధరించిన అయ్యప్పల దీక్షా నియమావళి

1. యోగ్యుడైన ఆధ్యాత్మిక గురువు పాదపద్మములను ఆశ్రయించి దీక్షను పుచ్చుకొనవలెను. 2. గురు స్వామి ద్వారా "స్వామియే శరణం అయ్యప్ప" అనే తారక మంత్ర ఉపదేశమును పొంది భగవంతుని ఎట్లు పూజించవలెనో, ఎట్లు భగవత్సేవ చేయవలెనో నేర్చుకోవలెను. 3. గురువు చెప్పిన విధి విధానాలను, గురువు ఆదేశాలను శ్రద్ధగా పాటించవలెను. గురుస్వామి ఆజ్ఞను అతిక్రమించ కూడదు. 4. ఉదయ, సాయంకాలముల యందు విధిగా పూజచేయవలెను. 5. భగవంతుని అర్చించిన తరువాత ప్రసాదంగా పూజా పుష్పమును శిరముపై నుంచుకొనవలెను. 6. పూజ ముగిసిన తరువాత అవకాశం ఉన్నంత వరకు తప్పనిసరిగా దేవాలయాలకు వెళ్ళవలెను. 7. ఉదయ, సాయంకాలము లందు (రెండుపూటలా) చన్నీటితో తలస్నానం చేయవలెను. 8. నేలపై చాపవేసుకొని నిద్రించవలెను. (తలగడను ఉపయెాగించ కుండా) 9. బ్రహ్మచర్యమును ఆచరించవలెను. 11. అసత్యమాడరాదు. 12. నుదుటను విభూతి, చందన, కుంకుమలు ధరించవలెను. 13. గురుస్వామిగారి పర్యవేక్షణలో ఆ కాలానికి చెందిన సత్ గురుస్వాముల అడుగుజాడలలో నడుచు కోవలెను. 14. భగవంతుని సన్నిధిలో "పడి" వెలిగించునపుడు ఇతరులకు బాధ కలిగించని రీతిలో నాట్యమాడవలెను.

15. ప్రత్యేక పూజలు ముగిసిన పిదప గురుస్వాములకు ఒకరి తరువాత ఒకరుగా క్రమ పద్ధతిలో సాష్టాంగ నమస్కారము చేయువలెను. 16. ప్రత్యేక పూజ నిర్వహించిన భక్తునకు మిగిలిన స్వాములు సున్నితంగా పాదాభివందనం చేయువలెను. 17. పూజ చేసిన స్వామి కూడా ఇతర స్వాముల పాదాలకు సున్నితంగా, భక్తిగా నమస్కరించవలెను. 18. స్వామికి సంబంధించిన ఊరేగింపు ఉత్సవాలలో విధిగా పాల్గొని, కనీసం కొంత దూరమైన నడువవలెను. 19. దేవుని ఉరేగింపు ముగిసిన పిదప అందుకు సంబంధించిన ఆదాయ వ్యయములను "స్వామి" సమక్షంలో నివేధించవలెను. ఇదంతా గురుస్వామిగారి ఆజ్ఞమేరకు జరగవలెను. 20. దేవాలయములలోను, ఇంటిలోను వివిధ విశేష పూజలలోను బృందగానములు చేయవలెను. 21. అయ్యప్ప మాల యందు ఉండే అయ్యప్ప రూపుకు హారతిని ఇచ్చేటపుడు ఎడమచేతితో మాలను పట్టుకొని కుడిచేతితో హారతిని చూపించాలి (హారతి మంటల్లో మాలను, రూపును త్రిప్పకూడదు). 22. స్వచ్ఛమైన, శుభ్రత కలిగిన అభిషేక ద్రవ్యములు దొరికినపుడే స్వామికి అభిషేకములు(చేయించవలెను) చేయవలెను. అభిషేక ద్రవ్యాలు మంచివి కాకపోతే ఆలయంలోని విగ్రహం పాడైపోతుంది అనే విషయాన్ని దృష్టిలో ఉంచుకొని అభిషేకానికి మంచి ద్రవ్యాన్ని సమకూర్చుకోవలెను. 23. అభిషేక, "ప్రసాదములను"

స్వీకరించవలెను. 24. ప్రత్యేక పూజల యందును, స్వామిని అలంకరించుటయందును, అర్చనలలోను మరియు చేసే ప్రతీ మంచి పనిలోను ఏకాగ్రత, కలిగియుండవలెను. 25. భగవంతునికి చేసే సేవ, భగవత్ భక్తులకు చేసే సేవ ఒక్కటే అని భావించి వినయంతో సేవ చేయవలెను. 26. "స్వామియే శరణం అయ్యప్ప" అనే భగవన్నామమును స్మరిస్తూనే యుండవలెను. 27. తనకు ఆర్థికంగా ఎంత శక్తిగలదో అందుకు తగినట్లుగానే భగవంతుని అర్చించవలెను. 28. ఏదైన ఆహారమునకు సంబంధించిన దానిని భగవంతుని స్మరించి తరువాత తినడంగాని, భగవంతునకు సమర్పించి ఆ తరువాత తినడం చేయవలెను. 29. భగవంతునికి ఇష్టమైన కార్యాలను చేయునపుడు భయపడకూడదు. 30. భగవంతునకు సంబంధించిన ప్రత్యేక సేవా కార్యక్రమాలలో విధిగా పాల్గొనవలెను. 31. మంచి పనులు ఏవి చేస్తున్నా, భగవంతుని తలుస్తూనే చేయవలెను. 32. భోజనమునకు ముందు, భోజనానంతరమును కాళ్లు, చేతులు కడుగుకొనవలెను. 33. హితమైన "సాత్త్విక ఆహారాన్ని" మితంగా భుజించవలెను. 34. అయ్యప్ప దీక్ష ద్వారా ఆధ్యాత్మిక ప్రగతిని సాధించవలెను. 35. మనకు ఇష్టమైన పనినైనా పరిత్యజించి, స్వామి యొక్క సేవలో పాల్గొనుటకు సంసిద్ధుడగుచుండవలెను. 36. దీక్షకు అవసరమైనంత వరకే భౌతిక జగత్తు నుండి స్వీకరించవలెను. 37. మత్రి,

మారేడు మొదలగు వృక్షములకు నమస్కరించవలెను. 38. అవసరమైనంతవరకే నిత్య జీవన కార్యక్రమాలను ఆచరించవలెను. 39. దుఃఖము కలిగినపుడు క్రుంగిపోవుట గాని, సుఖము కలిగినపుడు పొంగిపోవుట గాని చేయకూడదు. 40. వివిధ హోమ, యజ్ఞముల ద్వారా వ్యాపించిన పోగను శ్రద్ధతో పీల్చవలెను. 41. పురాణ కాలక్షేపాలలో పాల్గొనవలెను. 42. భగవానుని అనుగ్రహము కొరకు సదా ప్రార్థించవలెను. 43. భక్తి భావము కలిగి యుండి భక్తి గ్రంథాలను చదువుచుండవలెను. 44. ఇష్టముతో దేవునికి సేవ చేయవలెను. 45. దేవుని కీర్తించునపుడు, నామములు ఉచ్ఛరించునపుడు తప్పులు రాకుండా జాగ్రత్తపడవలెను. 46. స్వామికి సంబంధించిన వివిధ శ్లోకాల, నామముల యందు అర్థాలను తెలుసుకోవలెను. 47. తన కంటే పరిణితి పొందిన భక్తులతో సాంగత్యము చేయవలెను. 48. భక్తి లేనివాని సాంగత్యమును, పరుషముగా మాట్లాడువాని సాంగత్యమును, క్రోధము కలిగిన వాని సాంగత్యమును పరిత్యజించవలెను. 49. కామ, క్రోధాదులను నిషేదించవలెను. 50. ఆలయాలలోను, పూజా మందిరాల వద్దను మంచి నడవడి కలిగి యుండ వలెను. 51. ప్రశాంత జీవితమును గడుపవలెను. 52. అన్య దేవతలను దూషించకూడదు. 53. అనవసరంగా ఏ ప్రాణికి కష్టం కలిగించకూడదు. 54. పూజా ప్రతిమలను చిత్ర పటములను (పూజా

నమయంలోను, పూజ తరువాత) శుభ్రంగా ఉంచుకొనవలెను. 55. పూవులు, పత్రి ఒడిలో వేసుకొని పూజించరాదు. 56. తడి వస్త్రములతో పూజకు ఉపక్రమించకూడదు. 57. పూజ చేస్తున్నపుడు కటిక నేలపై కూర్చుండరాదు. 58. భోజనానంతరం భోజనం చేసిన ప్రదేశమునందు చేతులు కడుగరాదు (చేతులు కడిగే చోటికి వెళ్ళి చేతులు కడగాలి) 59. తాంబూలమును స్వీకరించవచ్చునే గాని, తాంబూలమును నమిలి మింగరాదు. 60. శవమును చూడకూడదు అట్లు చూచినచో మరల తలస్నానం చేసి విభూతి, చందన, కుంకుమాదులు ధరించి దీపం వెలిగించి భగవంతునికి నమస్కరించవలెను. 61. అశౌచము కలిగిన (మైల కలిగిన) వారి ఇండ్లకు వెళ్ళకూడదు. 62. స్త్రీలను కనిసం తాకనైన తాకకూడదు. (ప్రాణాపాయ స్థితిలో తప్ప). 63. స్వామికి ఇష్టమైన రోజులలో ప్రత్యేక పూజలు నిర్వహించుట లేక ప్రత్యేక పూజలలో భక్తిగా పాల్గొనుట చేయవలెను. 64. పుణ్యక్షేత్రములను దర్శించవలెను. 65. శబరిమల వాసుని దర్శనార్థమై మాలధరించువారు ముందు తల్లిదండ్రుల ఆశీర్వాదము, గృహస్థాశ్రమమున నున్న వారు భార్య అనుమతి విధిగా పొందాలి. 66. మాల ధరించుటకు ముందు రోజు క్షురకర్మలు గావించి, మొలత్రాడు, యజ్ఞోపవీతం తొలగించి కొత్తవి ధరించవలయును.

67. మొట్టమొదటిసారి మాలధరించు కన్నెస్వామి ఏరుమెలి నుండి పాదయాత్రతో స్వామిని దర్శించి మకరజ్యోతిని గాంచుట వలన శబరియాత్ర విశిష్టత తెలియును. 68. ప్రతి యేటా మాల ధరించు/దీక్ష తీసుకొను అయ్యప్ప ప్రతిసారి మొదటిసారి మాలవేసినపుడు ఎలా దీక్ష చేయుదురో అటులనే చేయవలెను. 69. మాల ఎక్కడ ధరించెదరో అచ్చటనే మాల విసర్జించవలయును. గురుస్వామి ద్వారా కాని, వృద్ధ తల్లి ద్వారా కాని తీయువచ్చును. 70. మాలధారియైన అయ్యప్ప నేలపై నిద్రించాలి. పరుపులు, దిండ్లు వాడరాదు. పాదరక్షలు ధరించకూడదు క్షురకర్మలు చేయించుకోకూడదు. 71. దీక్షాకాలమునందు మధువు, మాంసము, ధూమపానము, వక్కపొడి మరియు బజారుపై లభించు తినుబండారములను విసర్జించాలి. 72. మాలధారియైన అయ్యప్ప మండల దీక్ష కాలమునందు ఏక భుక్తము నాచరించుట శ్రేయస్కరము. ఎందుకనగా దినమున మూడు సార్లు తినువాడు రోగి, రెండు సార్లు భుజించువాడు భోగి, ఒకసారి భుజించువాడు యోగి అనబడుతారని ఆర్యోక్తి, యోగత్వ సాధుతత్వ సంగమమే అయ్యప్ప జీవితము. 73. ప్రతి అయ్యప్ప ప్రాతః కాలమున నిద్రలేచి పూజా పరిమిత స్థలము స్వయముగా శుభ్రపరచుకొని బ్రహ్మ ముహూర్తమున సర్వదేవతా స్తుతి మరియు అయ్యప్ప స్వామి శరణుఘోష చేయువలెను. (చదువురాని వారు గురుస్వామి

ఉపదేశించిన "ఓం స్వామియే శరణమయ్యప్ప" యను మంత్రము 108 సార్లు జపించిన పూజ అవుతుంది.) సూర్యాస్తమయం తర్వాత శిరఃస్నానము చేసి విధిగా పూజించాలి. 74. మాలలో ఉండగా గోళ్ళు కొరుకుట, తీయుట చేయరాదు. 75. మాలధారియైన అయ్యప్ప నిరంతరము ఏకాంతవాసమున స్వామి నామము జపిస్తూ ఉండాలి. భార్య బంధువులు మరియు స్నేహితులతో తిరగడము వలన ఏకాగ్రత లోపించి దీక్షా నిబద్ధతను కోలుపోవచ్చు. 76. మాలధారియైన అయ్యప్ప, శుభ, అశుభ కార్యములలో పాల్గొనరాదు. దూర ప్రయాణములు చేయరాదు. 77. అయ్యప్ప భుజించే పదార్థములలో ఉల్లిపాయలు, వెల్లుల్లి, అల్లం మరియు మసాలా దినుసులు వాడరాదు. 78. దీక్షా బద్ధుడైన అయ్యప్ప గురునింద, పరనింద, ఇతరులతో వాదోపవాదాలు చేయకూడదు. 79. సర్వము త్యజించి స్వామికి ప్రతిరూపమైన అయ్యప్ప దీక్షాకాలమందు శరీరముపై బంగారు ఆభరణములు ధరించకూడదు. 80. అయ్యప్ప నడిచే మార్గములో మరో అయ్యప్ప ఎదురైనప్పుడు "స్వామి శరణమని" ఆత్మ నమస్కారము చేయాలి సమయానుకూలముగా పాద నమస్కారము కూడా చేయవచ్చు. 81. అయ్యప్ప నిద్రించునపుడు, పాద నమస్కారము చేయునప్పుడు మెడలో నున్న మాలముద్ర నేలను తాకకుండా జాగ్రత్త వహించాలి. 82. అయ్యప్ప నడిచే దారిలో శవం ఎదురైనప్పుడు లేక జన

సందోహములో తిరిగినప్పుడు గృహమునకు రాగానే ఆహారపానీయములు తీసుకోకుండ శిరఃస్నానము చేసి శరణుఘోష చేయవలయును. 83. ప్రతి అయ్యప్ప సమాజములోని వ్యక్తులతో సంభాషించునప్పుడు గౌరవ మర్యాదలను పాటించి పురుషులను స్వామియని, స్త్రీలను మాళికాపురం, బాలురను మణికంఠ, బాలికలను కుచ్చు మాళికాపురం అని సంబోధించవలయును. 84. ప్రతి అయ్యప్ప ఎవరైన భిక్షకు లేక భజనకు పిలిచినచో సాధ్యమైనంత వరకు పాల్గొనవలయును. 85. మాలధారియైన అయ్యప్ప కుల, మత, జాతి విభేదాల కతీతుడై ఉండాలి. 86. అయ్యప్ప జీవితం సేవాభాగ్యముతో అధికార హోదాలు, ధనబలం ప్రదర్శించకుండ సాధు జీవనము గడపాలి. 87. అయ్యప్ప దీక్షా సమయమున ఆడంబరాలు ప్రదర్శించకూడదు, ఆడిన మాట తప్పకూడదు, ఇతరుల మనసు నొప్పించకూడదు. 88. మాలధరించిన అయ్యప్ప సమాజపరమైన పరిచయస్తులకు నమస్కారము మరియు కరచాలనము చేయడము శ్రేయస్కరము కాదు. 89. ఋతుస్రావములో ఉన్న స్త్రీలతో మాట్లాడరాదు, చూడరాదు. 90. శబరిగిరికి ప్రయాణమైనపుడు పోయివస్తాను అని పలుకరాదు. 91. శబరిగిరిలో అయ్యప్ప భక్తులు పంబానదియందు స్నానము చేసేటపుడు వంశములోని పెద్దవారి పేర్లను స్మరించి వారి ఆత్మలకు శాంతి లభించాలని కోరుకావాలి.

92. శబరిగిరి యాత్రకు ఇరుముడి తీసుకుని బయలు దేరిన వారు రెండుపూటలా స్నానమాచరించి, శరణుఘోష చెప్పుకుని స్వామివారి పటములకు, ఇరుముడిలకు హారతి ఇవ్వవలెను. 93. భజన, పూజా సమయములలో తడిబట్టలు ధరించరాదు, చొక్కా ధరించరాదు, అంగ వస్త్రము నడుముకు కట్టుకోవాలి.

ఈ 93 భక్తి అంగములు సరియైన రీతిలో ఆచరిస్తే మనలోని వాచిక, కాయక, మానసిక కర్మలన్నీ సంస్కరించబడి, దశేంద్రియ సిద్ధి కలిగి (జ్ఞానేంద్రియ, కర్మేంద్రియాలను దశేంద్రియాలంటారు) మన హృదయంలో భగవంతుణ్ణి దర్శించగలుగుతాం. ఏకాగ్రతతో స్వామిని పూజించేటపుడు, భక్తిగా పాడేటప్పుడు భగవంతునిలో తాదాత్మ్యం చెందే భాగ్యం కలుగుతుంది. అప్పుడు వర్ణించలేనంత ఆనందం కలుగుతుంది. ఆ సమయంలో ఆనందంతో మన కళ్ళవెంట ఆనంద భాష్పాలు వస్తాయి. రోమాంచం కలుగుతుంది. కొద్ది క్షణాలు మన కళ్ళకు దివ్యకాంతి గోచరిస్తుంది. గగుర్పాటు కలుగుతుంది. మన హృదయంలో ఏదో చెప్పలేని దివ్యమైన భక్తి అనుభూతి కలుగుతుంది. మనం అర్చించే చిత్రపటంలోని అయ్యప్పస్వామివారి నేత్రాలలో జ్యోతి కనిపిస్తుంది. ఇంతకంటే గొప్ప అనుభవంగాని, అనుభూతి జీవితంలో మరొకటి ఉంటుందా?! ఇంతకంటే భాగ్యం, ఐశ్వర్యం మరొకటి ఉంటుందా? ఇట్టి అనుభూతిని 41

రోజుల దీక్షాకాలంలో ఏదో ఒక్క రోజైనా పొందగలగడమే అదృష్టం. అట్టి అనుభూతి కలగాలని ప్రయత్నించ కూడదు. విశేషభక్తి కలిగియుంటే భగవానుడే అట్టి అనుగ్రహాన్ని మనకు కలిగిస్తాడు. అంతటి భాగ్యాన్ని భక్తులందరూ పొందాలి. అందుకే త్యాగయ్య "నిధి చాలా సుఖమా రాముని సన్నిధి చాలా సుఖమా" అని గానం చేస్తూ రాముని సన్నిధే అసలైన పెన్నిధి అనే సందేశాన్ని మనకు అందజేసారు. గురువుల అనుగ్రహంతో మనమూ ఆ పెన్నిధిని పొందుదాం.

గురుస్వామి

కనీసము 18 సంవత్సరములు వరుసగా వనయాత్రచేసి వయోవృద్ధుడుగాను, నియమ నడత గలవాడై వుండాలి. సహజముగా అనేక పర్యాయములు శబరిమల యాత్రచేసి వనయాత్రలో గల మర్మములన్నియు తెలిసికొన్న, అంటే ఎచ్చట మకాము చేయవచ్చునో, ఎచ్చట రాత్రివేళ మకాము చేయకూడదో బాగుగ తెలిసికొని, మాలవేసినలగాయతు ఇక నుండి మీ బాధ్యత అంతానాది. మీరు కనుక ఏదైనా తప్పుచేస్తే గురుస్థానములో వుండి మిమ్ము కొండకు తీసుకుపోతున్న నన్నే ఆదోషం బాధిస్తుంది. అయ్యప్ప నన్ను విడువడు అని త్రికరణశుద్ధిగా హామీ యివ్వగలిగినవాడే గురుస్వామికి అర్హుడు. ప్రథమమున నియమావళి బోధించకుండా మాలవేయువాడు గురుస్వామియని పిలువబడడు. మీలో ఉన్న లోపాలను సవివరముగా తెలిసికొని ఆ లోపములు సరిదిద్దగల సమర్థుడే గురుస్వామియని పిలువబడుటకు అర్హుడు. శిష్యుల సందేహములు నివృత్తి చేయగలిగి, సరియగు మార్గమున నడిపించగలిగి యుండవలెను. మాలాధారణ, విసర్జన, ఇరుముడి మొదలగు మంత్రములు క్షుణ్ణముగా తెలిసి, పూజా విధానము, ఆవాహన మొదలు ఉద్వాసన వరకూ సక్రమ పద్ధతిన చేయగలిగి యుండవలయును. శిష్యులను క్రమశిక్షణ ప్రకారము నడిపించగలిగి యుండవలయును.

అసలు మండల దీక్ష అంటే.....!

18 మెట్లెక్కేటప్పుడు 41 దినములు దీక్షపూర్తై వుండాలా? లేక ఇంటి దగ్గరే 41 దినముల దీక్ష పూర్తైన పిమ్మట యిరుముడి కట్టుకొని బయలుదేరాలా? మన ప్రాంతములో యిదియొక ధర్మసందేహమై పోయినది. మరి చాలామంది ఈ అనుమానం తీరకనే శబరిమల యాత్ర చేసి వస్తుంటారు. వారందరి అనుమానాలు తీరాలని ఈ వివరణ.

శబరిమల యాత్రీకులు పాటించే మండలకాల వ్రత దీక్షయే పావన పదునెనిమిదిమెట్ల దేవతలపై కాలుమోపే అర్హతను కలిగిస్తుందంటారు. ఆ అర్హత గూర్చి సాక్షాత్ తారక ప్రభువైన స్వామి అయ్యప్ప ఏమన్నారంటే "నన్ను దర్శించదలచిన నా భక్తులు గురువునుచేరి, మాల దరించి, మండల కాల నైష్టిక బ్రహ్మచర్య వ్రతమాచరించి, ఇరుముడితో నా సన్నిధి ముంగిట మెట్లవలే పరుండు అష్టాదశ సోపాన దేవతలను దాటి రావలయును." అని అన్నారు. శాస్త్రప్రకారము మండలం అనగా మూడు పక్షములు, మూడు దినములు, ఒక పక్షమునకు 15 దినములు. మూడు పక్షములంటే 45 దినములు. దానితో మూడు దినములు కలుపుకొంటే 48 దినములు. అనగా శాస్త్ర ప్రకారము మండల కాలం అన్నది 48 దినములన్నమాట. అలనాటి వారు ఔషధ సేవనం, వ్రతమాచరణ వంటివి పై చెప్పిన మండల కాలదినములనే లెక్కించి ఆచరించేవారు. కానీ కాలనుసారంగా మన వాడుకలో 41 దినములనే

మండల కాలమని లెక్కించి వ్యవహరిస్తున్నాము. ఈ లెక్కప్రకారమే అనేక మంది అయ్యప్ప భక్తులు తమ దీక్షా కాలం 41 దినములని విశ్వసించి, ఆచరించి, శబరిమల యాత్ర చేయుచున్నారు. ఇదియు అంగీకారమే. ఉదాహరణకు పది గ్రాముల బంగారాన్ని ఆభరణముగా తయారు చేసేందుకు 1 గ్రాము బంగారు తరుగు యివ్వాల్సి యుంటుంది. నెల రోజులు పనిచేసినట్లు సంతకం పెట్టి జీతం తీసుకుంటాము. కాని 4 ఆదివారములు సెలవులుంటాయి. యిలా చూస్తే మనం పాటించిన 41 దినముల దీక్షలో అకాలస్నానం, అకాల భోజనం, అకాల నిద్ర, దైవ చింతనాలోపం, ఆగ్రహవర్తనం, అసత్యభాషణం వంటి తెలిసి తెలియక చేసిన పొరపాట్లకు ఎన్ని దినాలను తరుగు క్రింద తీసివేయాలో వారివారి మనస్సాక్షికే ఎరుక. ఇలా అరా కొరా దీక్ష చేసి 41 దినములు అయిపోయినదని ఇరుముడితో శబరికొండెక్కి, ఆ పదునెనిమిది మెట్ల దేవతలపై మానవ మాత్రులమైన మనం పాదం మోపువేళ అందునిత్యనివాసులై యుండు పదునెనిమిది దేవతలు మన భక్తిని కొలిచి తరుగు మినహా ఎన్ని దినముల దీక్షతో వచ్చి యున్నామను లెక్కను శ్రీ స్వామివారికి సమర్పించు వేళ దోషిగా తలవంచుకొనక తప్పదు. కావున దీక్షా దినముల లెక్క విషయంలో తగు జాగ్రత్త వహించాలి. లేకపోతే పుణ్యానికి బదులు పాపం మూటకట్టుకు వచ్చినట్టులగుతుంది.

ఇరుముడి కట్టుకొనేవారు పొందవలసిన అర్హత గూర్చి కేరళీయుల "వేలన్‌పాట్టు" అను మళయాల గ్రంథములో "ఐంబత్తిఒన్నునోన్పిరున్ను, నూట్రిరెండు కుళియుం కుళిచ్చు భగవాండె వళ్లిక్కెట్టుంతాంగి" యని చెప్పబడియున్నది. అనగా మాలధరించిన దినమునుండి 51 దినముల వ్రతదీక్షయు, 102 పూటల చన్నీటి స్నానము ఆచరించియున్న వారికి మాత్రమే యిరుముడికట్టుకొనే అర్హతయు, దాన్ని మోస్తూ శబరిమల ఎక్కే శరీరబలము సిద్ధిస్తుందట. ఈ విధముగా చూస్తే మనమాచరించిన దీక్షలో పది లేక పన్నెండు దినముల వరకు తరుగు క్రింద తీసివేస్తే మీ మండల కాలదీక్ష ఎప్పుడు పూర్తౌతూందో మీరే లెక్కవేసుకొండి. సత్య ధర్మాదుల పర్యవేక్షణలో యుండి మన భక్తిని, దీక్షను కొలిచే సోపాన దేవతా స్వరూపమగు పదునెట్టాంపడి ముంగిట, నిలబడిన ప్రతివారూ తాను తు.చ. తప్పక మండలకాల దీక్ష వహించియున్నామని అంతర్యామి సాక్షిగా అంగీకరించగలిగితే... నిర్భయంగా ఆ పావనమెట్లను ఎక్కవచ్చును. కాని మండలకాలం అన్నది మనోమాలిన్యాన్ని తొలగించుకొనుటకు ప్రసాదించబడిన అవకాశం అన్న సంగతి ప్రతివారు గుర్తుంచుకొని, లభించిన సదవకాశాన్ని సద్వినియోగపరుచుకొనేరీత్యా దీక్షాకాల మంతయు శ్రీ స్వామివారి శరణ నామములను ఎడతెగక పలుకుతూ... లక్షల సంఖ్యలో వ్రాస్తూ... అన్యచింతనలేక శ్రీస్వామివారి తలంపుతోనే గడపాలి. అదియే ఉత్తమ భక్తులు ఆచరించే దీక్ష. అలాచేయబడు మండలకాల దీక్షతోనే పావన పదినెట్టాంపడి ఎక్కాలి

అను విధి యున్నది. ఇక ఆరోగ్యరీత్యా పరిశీలిస్తే ఈ దీక్ష మానవుల కెంతో మేలు చేస్తూందనియే తెలియున్నది. మాలవేసుకొన్న దినము నుండి ఆచరించబడే బ్రహ్మచర్య దీక్ష మూలాన శరీరములో ఇంద్రియ వృద్ధి పెరిగి, తేజస్సును, ఓజస్సును కలిగించును. రెండు పూటల చన్నీటి స్నానం శరీర ఉష్ణాన్ని తగ్గించి, మెదడుకు తుల్యమైన ఆలోచనా శక్తిని ప్రసాదిస్తుంది. నియమిత, పరిమిత, సాత్విక, సకాల, ధర్మార్జన, శాఖాహార భక్షణం మూలాన జీర్ణేంద్రియములు క్రమీకరణమై రక్తాభివృద్ధిని కలిగించును. ఇదివరకు మన వద్ద యుండిన బద్ధకము తొలగి చురుకుదనం ఏర్పడును. శరీరం, మనస్సు రెండును అదుపుతప్పక ఎప్పుడు ఆజ్ఞాపించినా మేలుకొని పని చేయుటకు సిద్ధముగా యుండును. కఠినమైన వన యాత్రను ఈ దీక్ష సులభతరం గావించును. తదుపరి వచ్చే వన యాత్ర పర్వతారోహణం వేళలో శరీరము నుండి భారీగా చెమటోర్చుడంవల్ల దుష్టపునీరు తొలగి శరీరం లఘువై తీరును.

వన్యమృగ, విష సర్ప, పక్షిజాల సంచరితమైన శబరీ వనము చుట్టూ అనేకానేక వనమూలికలున్నాయి. సంవత్సరంలో సుమారు 12 దినములు మాత్రమే జన సంచారం. తక్కిన దినములు మృగ సంచారం మాత్రమే యుండు ఆ వన ప్రదేశములోని వన మూలికల ఆకులు, కాయలు, వేర్లు క్రిందపడి ఎండిపోగా అందుమీదగా కురిసిన వర్ష జలము ఔషధయుక్తమైన అళుదా, పంబా నదులుగా ప్రవహించును. అందున